
# ఏది వదిలేది?

## — సి. సుజాత



''అమ్మాయీ, ఇంక పడుకో రాదటే. ఎంత సేపలా కూర్చుంటావు? ఎంత ఏడ్చినా ఏం ప్రయోజనం కాస్త నడుం వాల్చమ్మా! నేనటు వద్దామంటే రైలు ఇలా ఊగుతుంటే పడిపోతానేమోనని భయం. విమలా పడుకోమ్మా''

శారదమ్మ బ్రతిమిలాడింది

మోకాళ్ళలో తలదాచుకొని కిటికీ దగ్గరగా కూర్చున్న విమల దిగ్గున తలెత్తి చూచింది. ఆ చిన్న కూపే అంతా పల్చని నీలిరంగు వెలుతురు పరుచుకొని వుంది. తల్లి, తండ్రి, మరిది, తోడికోడలు, మేనమామ అంతా తలో బెర్త్ మీద పడుకొన్నారు. శారదమ్మ మాటి మాటికీ కూతుర్ని పిలుస్తూ పడుకోమని బ్రతిమిలాడుతోంది.

''పడుకొంటున్నాలే'' అన్నది విమల. చేయి చాపి బెర్త్ మూలన వున్న తోలు సంచి అందుకొంది. సంచి పట్టుకొన్న వేళ్ళలోంచి చైతన్యం ప్రవహిస్తున్న భావన కలిగింది.

''వీళ్ళంతా అనుకొంటున్నట్లు తను నిజంగా దుఃఖంతో తల్లడిల్లి పోతూందా?''

''ఏమో...ఏమో...'' అన్నట్లు రైలు పట్టాలు సవ్వడి చేశాయి. తలతిప్పి అద్దాల్లోంచి దూరంగా కనపడుతున్న దీపాల తోరణాలు చూస్తోంది విమల. మమ్మల్ని అందుకోమని కవ్విస్తూ పరుగులు పెడుతున్నాయని. ''ఇంటి దగ్గర యమున, శరత్ ఏం చేస్తున్నారో... పోయిన తండ్రిని తలుచుకొని, తల్లి దీనావస్థ గుర్తు చేసుకొని దిగులుగా వున్నారో... టి.వి.లో మాచ్ చూస్తున్నారో...''

నవ్వొచ్చింది విమలకు. చేతిలో సంచి దూరంగా బెర్త్ పైన వుంచి వెనక్కు వాలి కళ్ళు మూసుకొంది.

వద్దన్నా అదే దృశ్యం. స్వేచ్ఛగా నీలాకాశంలో ఎగిరే పావురాలు. వందలు వేలు... ఎంత వెలుతురు... ఎంత స్వేచ్ఛ... ప్రపంచం అంతా అప్పుడే చూస్తున్నంత కొత్తగా ......

'ఆ కిటికీలు వేసెయ్... ఏవుంది బయట చూసేం దుకూ! వెధవ దుమ్ము ధూళీనూ. ఇక పడుకో. పది దాటింది. ఏమిటా జిడ్డు మొహం పోయి కడుక్కో... ఆ బజారు తిండి ఏం బావుంటుందీ. హాయిగా ఈ పళ్ళు తిను... ఏమిటే అమాంతం తినేయటమే... శుభ్రంగా కడుక్కోవూ... వెన్నెల్లో డాబా మీద కబుర్లా... నెమ్మిగా వుంటే. మంచుపడుతోంది. లోప లకు రా... వర్షంలో తడవటమా! నాకు చిరాకు ఆ బురదా నీనా... ఛీ...ఛీ... రా లోపలకు...''

ఆ గొంతు ఇంకెప్పుడూ తనను దబాయించదు. ''ఇదే తిను... ఇదే తాగు... ఇలాగే వుండు'' అంటూ శాసించదు. విమల భయంగా కళ్ళు తెరిచి చూచింది. తను ఏదైనా మాట్లాడిందా! ఎవరైనా తనను గమనిస్తున్నారా?''

అందరూ పడుకొన్నారు. విమల నిట్టూర్చింది. ఏమిటే ఇలా ఆలోచిస్తోంది. కన్ను మూసింది తన జీవిత సహచరుడు సూర్యం. తన భర్త... పిల్లలకు తండ్రి... అయినా ఎందుకు దిగులుగా లేదు... వద్దన్నా వెంటాడే ఈ స్మృతులు తనను ఎటువైపు లాక్కు పోతున్నాయి!

ఎవరో చిన్నగా మూలిగిన శబ్దం.

'వనజా పాపాయి లేచిందేమో చూడు'' మరిది రామకృష్ణ భార్యను లేపుతున్నాడు.

''మేలుకొనే వున్నానండి. ఓ పక్కనే పడుకొని మెడ నరం పట్టేసింది'' వనజ బద్ధకంగా ఆవులిస్తోంది.

''ఎప్పటికి చేరుకొంటాం'' అన్నది.

''రేపు సాయంకాలం'' అన్నాడు రామకృష్ణ.

''అబ్బ ఎంత చిరాగ్గా వుందో. ఇప్పుడు ఆకలి వేస్తోంది. ఇందాక సయించలేదు. అదేం భోజనం. ఆ పొట్లాల్లో కలిపిన అన్నం నాకేం నచ్చలేదు. వెధవ కూరలు... అవునూ. మాటే మరచాను. కాశీలో మీరేం వదిలేస్తారూ''

''నోరు మూసుకొని పడుకో. వెధవ ప్రశ్నలు'' రామకృష్ణ విసుక్కొన్నాడు.

వనజ ఏదో గొణుగుతోంది.

విమలకు నవ్వొచ్చింది.

రామకృష్ణ అనవసరంగా విసుక్కొన్నాడు. అది మంచి ప్రశ్నే. కాశీలో స్నానం చేశాక మనకు ఇష్టమైన దేదో వదిలేయాలట. తనకు ఏది ఇష్టం? ఏదో! తన ఇష్టాలు ఇప్పుడేవీ లేవు. అందరి ఇష్టాలూ తనవై పోయి,

తన ఇష్టం ఏమిటో తెలియకుండా పోయింది.

ఆలోచనలు కళ్ళాలు లేనట్లు పరుగులు తీస్తున్నాయి. ఎప్పటికో... ఎక్కడికో... తన గొంతు నొక్కేసిన సంఘటనలు... ఎన్నో... ఎన్నెన్నో...

అప్పటికి పదేళ్ళ వయసుంటుందా?...

"వర్షం వస్తుంటే వేడి వేడి అన్నంలో ఆవకాయ కలుపుకొని తింటే బావుంటుందమ్మా!"

శారదమ్మ విసుక్కుంది.

"హీ మొహంలా వుంటుంది. నీ కసలు అంతలేసి కారాలు పడవు. కడుపులో మంటంటావు. ఇదిగో పప్పు వంకాయ కూర, సాంబారు కలుపుకో ఎంత బావుంటాయో"

"ఛీ... నాకేం వద్దు ఆవకాయ తింటా"

"ఇదెక్కడి పిల్లమ్మా వెధవ ఆవకాయ పట్టుకు కూర్చుంది. కమ్మగా కూర చేస్తే ఆ ఆవకాయ పచ్చడి కోసం చస్తావేమిటే... తినూ... తినమంటుం టుంటే..."

ఇక ధారలుగా పడే వర్షం చూడటమూ... వేడి వేడి ఆవకాయన్నం తినటమూ, చల్లని గాలి, వర్షం తుంపరలూ ఇవేం లేవు... రావు. తలుపులు బిడాయించుకొని లైటు వెలుతురులో అమ్మ తిట్లూ సాంబారన్నం నంజటమూ..."

విమల నిట్టూర్చింది...

బొటానికల్ టూర్‌కి వెళ్ళాలి నాన్నగారూ. అందరూ డబ్బు కట్టేశారు. తప్పనిసరిగా సైన్స్ వాళ్ళంతా వెళ్ళాలి. క్రితంసారి అన్నయ్య వెళ్ళలేదూ...

"వాడు వెళితే వాడితో నీకు వంతా! నేను మీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతాను. నువ్వు వెళ్ళక పోయినా కొంపలేం మునిగిపోవు. రేపు మన పల్లెకు పో. కావలసినన్ని ఆకులూ, పూవులూ చేల నిండా అవే"

"ఛీ... నేను పోను. టూర్ వెళ్ళొద్దా. సరదాగా అందరూ వెళుతుంటే..."

"ఎక్కడికే వెళ్ళేది! చదువు మానేసేయ్. వెధవ సంత అంతా మీరి పోతున్నారు..."

ఆకాశంలో రివ్వుమంటూ ఎగిరిపోయే పక్షి రెక్కలు నిర్దాక్షిణ్యంగా కత్తిరిస్తే ఏమవుతుంది?

"బియిడీ నే బెస్టూ! ఆడపిల్లకు తగిన ఉద్యోగం టీచింగ్..."

" ఆ పిల్లలతో వాగటం నా వల్లకాదు బాబూ. పోనీ ఓ సంవత్సరం లైబ్రేరియన్‌గా ట్రెయినింగ్ అవుతాను ..."

"వద్దని చెప్పానా కదా... ఇదిగో అప్లికేషన్. ఫలానా యాజులుగారి అమ్మాయంటే ఎలా వుండాలి మంచి, మర్యాదా..."

"ఆ...ఆ... యాజులుగారి అమ్మాయి. ఘనత... జిడ్డోడుకుంటూ...ఛీ..."

విమల మరోవైపు తిరిగి పడుకొంది. కంటి కొసన నీటి ముత్యం లైటు వెలుతురులో మిల మిల మెరిసింది.

"అబ్బాయికి ఆరెమ్మెస్‌లో ఉద్యోగం. గవర్నమెంటు ఉద్యోగస్తుడు. కోరి చేసుకొంటానంటుంటే ఏం తెగులా...?"

"ఆ అబ్బాయికి అంత కోపం ఏమిటే! కొత్త చోటని కూడా చూడకుండా చెల్లెల్ని విసుక్కోవటమూ, తల్లిని నోరు ముయ్యమనటమూ, ఇదేంమనిషే..."

"ఏం కాస్త కోపిష్టి అయితే...! మనిషన్నాకా కోపం చిరాకూ పరాకూ ఏం లేకుండా వుంటాయా? నాకు కోపమే... నీకేం నయిందీ... హాయిగా లేవూ..."

"అయ్యో సంబడం. హాయిగా... ఎంత హాయిగా గంటకోసారి తిట్లు తింటూ... ఎంత సుఖం..."

"నోరు మూసుకో. క్షణానికోసారి తిట్టనందుకు సంతోషించు. అసలు నువ్వే దానికి నవ్వుతున్నావు. పిల్లాడు శుభ్రంగా వున్నాడు. ఖాయం చేస్తున్నా"

అయిపోయింది అదీ అయి పోయింది. కొత్త పుటలు ఏవీ లేవు. అంతా పాత కథలాగే.

"ఏమిటా ఉద్యోగం మానేస్తావా? ఎందుకూ బోలెడన్ని సెలవులు. కొంపలోనే ఏడుస్తావుగా. మంచి స్కేలు. అలాలు దిద్దించటం పెద్ద కష్టమా!

"ఇంతోటి పనికీ వంటకీ నాకు అలసటగా ఆయాసమా! మా అమ్మ పది మందికి గంటలో వండి పెట్టేది. నువ్వు ఇద్దరికి చేసేందుకు ఏడుస్తావు..."

"ఇదేం అలవాట్లే బాబూ. ఎంత కడుపులోవుంటే మాత్రం. అంత పుల్లటి పొంగళాలు తింటే అందునా మానె వస్తువులు తింటే రోగం రాదూ. హాయిగా గారెలు వండు. ఉల్లిపాయ గారెలు తిను. ఆ పుల్లటివి ఆరోగ్యానికి మంచివి కావు..."

ఏమిటే మామిడి తాండ్రా! ఎక్కడా లేదే ఈ విచిత్రం! ఎవరైనా స్వీట్సు ఫ్రూట్స్ కోరుకుంటారు. ఆ మామిడి రసం చాపల మీద పిండుతారట. ఆ ఈగలు, చీదర... అబ్బ తలుచుకొంటే డోకొస్తోంది"

విమల కళ్ళు తెరిచి పై కప్పు చూస్తూ పడుకొంది.

రైలు ఉయ్యాలు వూపుతోంది. తన వడిలో అప్పుడు యమున, గుప్పెట్లు ముడుచుకొని బుల్లి బుల్లి కాళ్ళు ఆడిస్తూ.'

"నీ బుద్ధికి ఎక్కడ తోస్తాయే బాబూ ఈ ఆలోచనలు. ఆ బెంగాలీ పేర్లు పెడితే నవ్వుతారు. చక్కగా

## తల్లికి తనయుని లేఖ

అమ్మా! నువు పుట్టిన రోజున
అమ్మమ్మ పొత్తిళ్ళలో వున్నప్పుడు
అందరూ ఆప్యాయంగా
నీ బుగ్గ ముద్దాడుతున్నప్పుడు
ఆహ్వానించావు కావు ఆహ్వానించావు కావు!
నా తల్లి పాల బుగ్గల నాట్యమాడే
అమాయకపు సిగ్గుల నవ్వును
అరిసి నేను మురిసి పోయేవాణ్ణి!
ఆహ్వానించావమ్మా? ఆహ్వానించావు కావు!
నీ చదువే చెప్పించలేదట మీ నాన్న
అమ్మమ్మ ఆదుకోనిచ్చేది కాదట
కదిల్తే మెదిల్తే తన్నేసేవారు
పైసా అడిగితే యిచ్చేవారు కారు;
గదిలోపల ఒక మూల
నువ్వెద్చే తరుణంలో ఒక్కసారి పిలిస్తే,
నేను తాతయ్యకీ అమ్మమ్మకీ
వీపులు విమానం మోత
మోగించేవాణ్ణి కావా?
పిల్చావు కావు, పిల్చావు కావేమమ్మా?
నీ ఏడుపు జీవితానికి
ఒకానంద నవనవోన్మేషకిరణం
నాన్నతో నీ పెళ్ళి! నాన్నతో నీ పెళ్ళి!
ప్రేమ వికసించకుండానే
పెళ్ళి చేసుకున్నారు మీరు
తరువాతే మీ హృదయాల్లో
తనంత తా ప్రేమ వెలిసింది
వెలసి వెలసి వెలిగి వెలిగి మీ యిద్దర్నీ
గిలిగింతలు, చక్కిలిగింతలు పెట్టింది.
నీ వివాహ ముహూర్తానికి
మీ ప్రథమ సాన్నిధ్య సమయానికి
శుభలేఖ పంపేవు కావు
పంపితే యిచ్చేవాణ్ణి కావా
పదివేల బహుమానాలు?
పది వందల వేల శుభాకాంక్షలు!
నన్ను నువ్వు గిరికీ కొట్టించావు.
నీ అమృతానిర్వాణం,
బాల్యం, కల్యాణ మహోత్సవం
ఏవీ నన్ను చూడనిచ్చావు కావు!
నే చూసింది, అంతరించి పోతున్న
నీ యౌవన సాయం సంధ్యా
కిమ్మీర కిరణకాంతులే!
నాటిక ముగిసిన మీదట
నాకు టిక్కెట్టిచ్చారు మీరు!
నన్ను కన్నావు! నన్ను కన్నావు!
నీతో కన్నావు కానమ్మా! నీతో కన్నావు కావు.
తల్లిదండ్రుల సరసాలూ విరసాలూ
విలాసం, కులాసా, కాస్తన్నా
తనయుడు చూడకూడదనా మీ తాత్పర్యం?
నన్ను గర్భంలో దాచి పెట్టుకున్నావు!
రెక్కలు ముక్కలయేటట్టు
ఇంటినిండా నువ్వు చేసే చాకిరీ
నాన్న కడుపు కక్కుర్తి కోసం
మీసం నెరిసిందాకా చేసే
కచేరీ గుమాస్తా నౌకిరీ
ప్రతి దినమూ మీ యిద్దరి హరాకిరి
చూడ్డానికా నన్ను కన్నారు
నువ్వూ మా నాన్నగారూ?
గిరికీ కొట్టించారు మీరు
గిరికీ కొట్టించారు మీరు కారామ్మా?!

– బులుసు-జీ-ప్రకాష్

మీ నాన్న పేరో, మా నాన్న పేరో...''

విమలకు నవ్వొచ్చింది. అప్పుడు తనకు నచ్చిన పేరేమిటో ఇప్పుడు గుర్తులేదు. యమున పెరిగి పెద్దదవుతోంది. తన ఇష్టాలు ఎన్నో అనుకుంది. తన పాప అలా కాదు. స్వేచ్ఛగా వుండాలి.

''పాప గోరింటాకు పెట్టుకొని వెన్నెల్లో భోజనాలు చేసి ఉయ్యాల ఊగితే ఎంత బావుంటుంది. చిన్నప్పుడు మేమంతా అలా...''

''అబ్బ బోర్ మమ్మీ... గోరింటాకు ఫేషన్ కాదు. అంతగా అయితే హెన్నాతో డిజైన్ చేయించుకొంటాం. తెల్లవారు ఝామున హాయిగా నిద్రపోక భోజనాలు ఏమిటి మమ్మీ. నీ చాదస్తం కానీ... అయ్యబాబోయ్ గోంగూరా - తలుచుకొంటేనే బోర్...''

''అరేయ్ శరత్... ఈ పుస్తకం చూశావురా... నిజంగా గోబీ ఎడారుల్లో తిరుగుతున్నట్లే వుంది. ఛంగీజ్‌ఖాన్ గొప్ప నవల రా ... చదివి చూడు''

''అమ్మో నా వల్లకాదు. మంచి పాప్ మ్యూజిక్ వుంది. ఓ గంటలో షార్జా మాచ్ వస్తుంది. ఐయామ్ వెరీ బిజీ''

మండి పోతున్న కళ్ళు మూసుకొంది విమల.

చుట్టూ ఎన్నో గొంతులు భరించలేనట్లు చెవులు మూసుకొంది విమల. ఇన్నేళ్ళ జీవితం తను మనసారా కోరుకొన్నది ఏదైనా అనుభవించిందా? తన ఆలోచనలు, అలవాట్లు ఏదీ తన సొంతం! ఇందులో ఏది వదిలేయాలి? విమల దీర్ఘంగా నిట్టూర్చింది. బలవంతంగా నిద్రపోవాలని ప్రయత్నిస్తూ కళ్ళు మూసుకొంది.

* * *

''అమ్మా ఇక్కడే దిగండి. లోతు తక్కువగా వుంది... ఆ అదే... ఇప్పుడు పవిత్ర గంగలో ఓసారి తల నిండా మునగండి...''

విమల చుట్టూ చూస్తోంది. చుట్టూ, చాలా చీదరగా వుంది. బొగ్గులూ పువ్వులూ, ఉమ్ములూ భయంకరంగా వుంది ఆ ప్రదేశం. ఇదే పుణ్యనదో... ఇక్కడ మునిగితే పుణ్యం కాదు రోగం వస్తుంది.

''ఏమిటే దిక్కులు చూస్తావూ... మునగూ.!!

# మెటమార్ఫోసిస్

అల్లప్పుడెప్పుడో... అమ్మకడుపులో ముడుచుకున్న లేత ప్రాణం
లెక్క పెట్టుకున్న క్షణాలూ, నిముషాలూ, గంటలూ, రోజులూ, నెలలూ -
అప్పుడు కాలం... అమ్మ గుండెలయ!

ప్రశాంత విరామం తప్ప మరేమీ లేని ఆ పరిణామక్రమాన్ని దాటిన
సీతాకోక చిలుక విహారం వంటి శైశవాన, కాలం గంతులేసే తువ్వాయి!
అమాయకత్వపు పొరలు విచ్చుకుంటూనే, యింకా అరుణోదయాన్ని
అనుభవించ శృంగారాన్ని ఆనందించగలిగినప్పుడు కాలం...
పండిన గోరింటాకు చూసుకుంటూ పరుగెత్తే ముగ్ధ ఇంకా!
ప్రథమ యౌవనపు పరుగులూ, ఉడుకు రక్తమూ, ఉరకలెత్తే సాహసమూ
ముప్పేటలుగా పెనవేసుకున్నప్పుడు కాలం...
గర్వంతో నిమురుగా ఊగే అందమైన వాలుజడే!
కష్టం చావులూ, కామం నిండిన కళ్ళూ, రాజకీయాల కుళ్ళూ
కారుణ్యాన్ని చంపి, కాలుష్యాన్ని నింపుతున్నప్పుడు కాలం
పట్నపు మురికిని మింగుతూ మందకొడిగా పాకుతున్న డ్రైనేజీ కాల్వ!
యాంత్రిక జీవితపు రొదా, భావ దారిద్ర్యమూ, అనుభూతి రాహిత్యమూ
మనముపై బూజులా పరుచుకున్నప్పుడు కాలం...
తనలోకి తాను ముడుచుకు పోతూ, భయపడుతూ పోయే నత్త కదూ!
ఇన్ని రూపాలు చకచకా మార్చుకున్న కాలం, మరొక్కసారి కొత్తగా,
చక్కని అమర సుగంధ పారిజాతంగా మారిపోతే బాగుండుననే పేరాశలో,
యిప్పుడు... ఈ నిర్లిప్త సంధ్యా సమయాన,
అయ్యో! గడియారం రెండు నాల్కల పాములా సాగుతూ
జబ్బు పడి కప్పనంటి యుగాలాన్ని మింగేస్తూ వుంటే...
దీని బలహీనపు గుండె చప్పుడు టిక్ టిక్ మంటూ...
తర్వాత? అమ్మ కడుపులోని ప్రశాంతత వంటిదే మళ్ళీ?... ఏమో!

— ''లలిత''

సర్వపాపే వివారిణీ గంగకు మురికేమిటే మునగూ...''

ఒక మునక వేసింది విమల. అంతా ఉక్కిరి బిక్కిరిగా వుంది. తన బాల్యం తనది కాదు. రెండో మునక తన యవ్వనం తన స్వంతమూ కాదు. భర్త ఇష్టం. భర్త కోరికలు, ఆలోచనలు అదే. అది తన అనుభవం. మూడవ మునక. తన యాంత్రిక జీవితం వంటా వార్పూ, వడ్డన, స్కూలు, పిల్లలూ కాంపోజిషన్ పుస్తకాలూ పిల్లలూ, వాళ్ళ పెత్తనం ఇదే తనకు మిగిలింది. తన స్వంతం ఏదీ లేదు. తను వదిలేందుకు ఏదీ లేదు. వీళ్ళలో ఎవరి ఇష్టం తను ఈ గంగ పాలు చేస్తుంది? తనకు ఆ హక్కు లేదు. ఏదీ వదిలేందుకు లేదు.

చుట్టూ వేన వేల గొంతులు నవ్వుతున్న సవ్వడి. ఈ గంగలో స్నానం చేస్తే మరుజన్మ వుండదట. నిజంగా వుండదా! పోనీ... తనది కాని తన మరో జన్మ తనకెందుకు...? విమల చుట్టు గంగ... ఎన్ని పాపాలనో తనలో కలుపుకొన్నే గంగాదేవి... గలగలా ప్రవహిస్తోంది. "నేను వద్దన్నా నన్ను మురికి చేస్తున్నారు. చూడు ఎలా అయిపోయానో... నన్ను చూస్తే నాకే దిగులుగా వుంది. నేనెప్పుడూ స్వచ్ఛంగా ప్రవహించను కాబోలు... ఇలాగే ఇతరులు చేసిన మురికినీ ... పారేసిన చెత్తనూ మోసుకుంటూ...!"

గంగ నిట్టూర్పు విమల చెవుల్లో వినపడింది.

